# భీమ్‌గల్ అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

## బాల్కొండ కానిస్టెన్సీ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్

భీమ్ గల్, బతుకమ్మ :భీమ్ గల్ పట్టణ అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఇప్పటికే భీమ్ గల్ అభివృద్ధికై రూ.54 కోట్ల నిధులను మంజూరు చేసిందని బాల్కొండ కానిస్టెన్సీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణ శివారులోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి తాను ఒక ఎమ్మెల్యేనని మర్చిపోయి కనీస భాద్యత లేకుండా కేవలం ప్రభుత్వాన్ని భద్నాం చేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. 2022 లో జూన్ 18న రూ.35 కోట్ల అంచనా వ్యయం తో పది పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చడానికి ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేసి అప్పుడు రోడ్లు, భవనముల మంత్రిగా ఉన్న ప్రశాంత్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న హరీష్ రావు ను పిలిపించుకొని ఎనిమిది అంటే ఎనిమిది నెలల్లోనే ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చి ఆసుపత్రి నిర్మాణానికి డబ్బులు ఇవ్వకుండా ప్రజలను మోసం చేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయడానికి మూడు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశార న్నారు. ఇంకా అవసరమైన మేరకు నిధులను మంజూరు చేసి ఆసుపత్రిని పూర్తి చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ కు 2021 లొ శంకుస్థాపన చేసి టి యు ఎఫ్ ఐ డీ సీ నుండి కోటి, ప్రత్యేక నిధుల నుండి 2 కోట్లు కేటాయిస్తున్నట్టు చెప్పారని, దానికి ఒక్క నయా పైసా బిల్లు కూడా చెల్లించలేదన్నారు. భీమ్ గల్ అభివృద్ధికి మొదటి అడ్డంకి ప్రశాంత్ రెడ్డి కమిషన్లు తీసుకోవడం ఆయనకు ఆనవాయితీ పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు భయపడేలా చేశారన్నారు. కాంట్రాక్టర్లను పనులు చేయాలని అడిగితే గత ప్రభుత్వంలో చేసిన పనులు తాలూకు బిల్లులన్ని పెండింగ్లో ఉన్నాయి అంటున్నారన్నారు. వంద పడకల ఆసుపత్రిని అతి తొందరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తుందన్నారు. గతంలో రవణా శాఖ మంత్రిగా ఉండి కూడా ప్రశాంత్ రెడ్డి భీమ్ గల్ బస్ డిపో ను తెరిపించలేకపోయారని, ఏదో ఎన్నికల ముందు నాలుగు బస్సులను ఆర్మూర్ నుండి తెచ్చి పార్కింగ్ చేసి బస్ డిపో ప్రారంభించినట్లు చేసారన్నారు. శాసన సభ ఎన్నికల సందర్భంగా గానీ, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గానీ,మేము ఏనాడు బస్ డిపో తెరిపిస్తామని చెప్పలేదని, వారిలా దొంగ మాటలు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి తెలియద న్నా రు. యూరియా యాప్ విషయంలోనూ రైతులలో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేశారు కానీ వారి ప్రయత్నం సఫలీకృతం కాలేదన్నారు. నీళ్ల విషయంలోనూ ప్రశాంత్ రెడ్డి రాజకీయం చేస్తు న్నారని, రైతులకు నీళ్లు ఇవ్వాల్సిందే తప్పకుండా ప్రభుత్వం నీళ్లు ఇస్తుందన్నారు.

ఎస్సారెస్పీ లొ 25 టిఎంసీల నీళ్ళున్న లీకేజీ నీళ్లు అడిగిన పాపానికి బాల్కొండ నియోజకవర్గ రైతుల మీద కేసులు పెట్టిన చరిత్ర ప్రశాంత్ రెడ్డిదని, అసలు రైతుల గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. ఎస్సారె-స్పీ పునరుజ్జీవనం పేరుమీద కమిషన్లు మింగిన ప్రశాంత్ రెడ్డి కాళేశ్వరం పథకం ద్వార ఒక్క టి ఎం సీ నీటినైనా ఎస్సారెస్పీ లొ నింపారా ? ఆయన గుండెల మీద చెయ్యి వేసుకొని ప్రజలకు నిజాన్ని వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. డూప్లికేట్ ఇంజనీర్ గా ప్ర శాంత్ రెడ్డి కట్టిన చెక్ డ్యాంల వలె పునరుజ్జీవన పథకం మిగిలిపో యిందని ఏద్దేవా చేశారు.

కరువు పరిస్థితులు తెలిసి కూడా ప్రశాంత్ రెడ్డి



రాజకీయంగా లబ్ధి పొందడానికి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, రైతులను నిండా ముంచిన ఆయన ఈరోజు దొంగ మాటలు చెప్తే నమ్మే పరిస్థితుల్లో రైతులు లేరన్నారు. ఇకనైనా తన డ్రామాలు ఆపి తాను ఎమ్మెల్యేనని తనను తాను గుర్తుంచుకొని బాధ్యతాయుతంగా మెలగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిరుతను చంపిన ఇద్దరి అరెస్టు

### పరారీలో నలుగురు వ్యక్తులు

### నాటు తుపాకీ స్వాధీనం

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ: నిజామాబాద్ జిల్లా భీంగల్ అటవీ ప్రాంతంలో చిరుతను చంపిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని, పట్టుబడిన ఇద్దరి నుంచి ఒక నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్టు గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.. సీపీ కథనం ప్రకారం... నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ పరిధిలోని భీంగల్ మండలం కారేపల్లి దక్షిణ బీట్ నందు ఒక చిరుతపులిని కొందరు వ్యక్తులు హతమార్చినట్లు వచ్చిన సమాచారం మేరకు కమ్మర్ పల్లి రేంజ్ అధికారి కే అనిత, సిబ్బంది భీంగల్ మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన మలావత్ సంజీవ్, దేవక్క పేట గ్రామానికి చెందిన సిరిసిల్ల రాములు అనే అనుమానిత వ్యక్తులను విచారించగా వారు ఒక చిరుత పులిని హతమార్చినట్లు ఒప్పుకున్నారు. వారిని విచారించగా కారేపల్లి దక్షిణ బీట్ పరిధిలోని 79 కంపార్ట్మెంటులో హతమార్చిన చిరుత పులి కళేబరాన్ని దాచినట్లు తెలిపారు. కమ్మర్ పల్లి అటవీ క్షేత్రాధికారి సిబ్బందికి వారు ఆ కళేబరాన్ని భూమిలో దాచిపెట్టిన ప్రదేశాన్ని చూపించి తామే స్వయంగా తవ్వి తీసినారు. దానిని చిరుత పులి కళేబ రంగా గుర్తించారు అటవీశాఖ అధికారులు.

మాలావత్ సంజీవ్ అనే వ్యక్తి భీంగల్ మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన మేకల కాపరి. సుమారు ఒక నెల రోజుల క్రితం మేకల మందను కారేపల్లి అటవీ ప్రాంతంలో మేపడానికి వెళ్లగా ఒక ఆడమేకను చిరుత పులి హతమార్చింది. ఈ విషయాన్ని తన గ్రామంలోని ఇతర వ్యక్తులకు తెలపగా ఈ విషయాన్ని తెలుసుకున్న దేవక్క పేట గ్రామానికి చెందిన సిరిసిల్ల రాములు చిరుత పులి తిరిగి ఆ కళేబరం దగ్గరికి వస్తుందని దాన్ని చంపి దాని శరీర భాగాలను అమ్ముకుంటే లక్షల్లో డబ్బు వస్తుందని మాలావత్ సంజీవ్ కు ఆశ చూపినాడు. ఆ రాత్రి మలావత్ సంజీవ్ తన గ్రామానికి చెందిన ఇతర నలుగురు వ్యక్తులతో కలిసి ఆ కళేబరంలోకి గడ్డి మందును సిరంజి ద్వారా ఎక్కించినారు. మరుసటి రోజు ఉదయం ఆ ప్రాంతానికి నిందితులు వెళ్లి చూడగా చిరుత పులి చనిపోయి ఉంది. ఈ విషయాన్ని మలవత్ సంజీవ్ సిరిసిల్ల రాములు ఇతర నలుగురు వ్యక్తులకు తెలిపినాడు. వారు అక్కడికి వచ్చిన తర్వాత ఆ కళేబరాన్ని దాచిపెట్టి సరైన కొనుగోలుదారుడు దొరికిన తర్వాత దానిని తీసి అమ్ముకుందామని నిర్ణయించుకున్నారు. విచారణలో భాగంగా సిరిసిల్ల రాములు ఇంట్లో తనిఖీ చేయగా అక్రమంగా దాచిన ఎటువంటి ఆయుధ లైసెన్స్ లేని ఒక నాటు తుపాకీ దొరికినది. దానిని అటవీశాఖ అధికారులు తదుపరి విచారణ కొరకై భీంగల్ పోలీసులకు అప్పగించినారు.ఉద్దేశపూర్వకంగా వన్యప్రాణి అయినా చిరుత పులిని చంపిన నేరానికి?గురువారం ఇద్దరు వ్యక్తులను అటవీశాఖ అధికారులు అరెస్టు చేయడం జరిగింది. ఇతర నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారు .వీరిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం 2022 ,తెలంగాణ అటవీ చట్టం ,జీవవైవిద్య చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడం జరిగింది. నిందితులను ఆర్మూరు న్యాయస్థానంలో హాజరు పరచడం జరుగుతుందని సీపీ తెలిపారు..




# తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట కమిటి వినతి

### సిపిఎస్ నుండి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్

హైదరబాద్, బతుకమ్మ :ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిపిఎస్ అమలు తేదీ అయిన కంటే ముందే నియామక నోటిఫికేషన్లు విడుదలై ఆ తర్వాత నియామకాలు పొంది ప్రస్తుతం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంలో కొనసాగుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) వర్తింపజేయాలని 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట కమిటీ తెలంగాణ రాష్ట్రం ప్రతినిధుల బృందం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వినతిపత్రాన్ని సమర్పించింది. గురువారం సచివాలంలో 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట కమిట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాడవేడి వినోద్ కుమార్ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సంతోష్ కుమార్ కోశాధికారి గుంటి వేణుగోపాల్ రాష్ట్ర ముఖ్య సలహాదారు రేండ్ల రాజేష్ తెలంగాణ గ్రూప్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ తెలంగాణ సచివాలయం అధికారులు స్వామి గౌడ్ జే. వినోద్ ఎం తిరుపతి సంఘ ఇతర కార్యవర్గ సభ్యులు ఈ బృందంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్లు విడుదలయి ఆ తర్వాత ఆలస్యంగా జాయిన్ అయిన వారికి పాత పెన్షన్ పరిధిలోకి తీసుకువచ్చే అవకాశాన్ని కల్పించిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ?చట్టం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ మార్పులను అనుసరించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా 2004 కంటే ముందు నోటిఫికేషన్లు విడుదలయి ఆ తర్వాత నియామకాలు జరిగి సిపిఎస్ విధానంలో నష్టపోతున్న ఉద్యోగులందరినీ మానవీయ కోణంలో ఆలోచించి ఓపిఎస్ పరిధిలోకి తీసుకువచ్చేలా ముఖ్యమంత్రి తో ప్రతినిధ్యం వహించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ని కమిటీ నాయకులు ఉద్యమాల సుదీర్ఘ పోరాట నేపథ్యాన్ని వివరిస్తూ విజ్ఞప్తి చేశారు.



# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రుద్రూర్, బతుకమ్మ :యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నార్కోటిక్ (ఈగల్) డీఎస్పీ సోమనాదం విద్యార్థులకు సూచించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసా య విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ ఏయూ) పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని విద్యార్థులకు గురువారం నార్కోటిక్ (ఈగల్) డీఎస్పీ సోమనాదం మాదకద్ర వ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, జీవితాలను నాశనం చేసుకోవద్దని వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసిపి శ్రీనివాస్, రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సై మనోజ్ కుమార్, పోలీసు సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయుని బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

